వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
సోమవారం, అక్టోబర్ 27, 2025

గడ్డం కేశవమూర్తి
Cell:9390101862

# ప్రతిభావంతులకు.. పట్టాభిషేకం

- గ్రూప్-1, 2 ఉద్యోగాలు సాధించిన పద్మశాలి యువతకు అభినందన వెల్లువలు
- ఉత్సాహంగా సన్మానోత్సవం..
- ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ ఐఏఎస్ చిట్ల పార్థసారథి
- చరిత్రను తిరగరాస్తున్న మనోళ్లు అంటూ కితాబు
- రాజ్యాధికారమే లక్ష్యంగా అడుగులు వేయాలంటూ ఉద్బోధ



**హనుమకొండలోని జడ్పీ సమావేశ మందిరంలో తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం, పద్మశాలి జర్నలిస్టుల సంఘం వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో గ్రూప్ –1, గ్రూప్ –2 ఉద్యోగాలు సాధించిన పద్మశాలి యువతీ యువకులకు ఆదివారం అభినందన సన్మానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. చిట్ల పార్థసారథి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై కీలకోపన్యాసం చేశారు.**

గ్రూప్స్ సాధించడం కల అన్నారు. లక్షలాదిమందిలో తీవ్రమైన పోటీ, ఒత్తిడిని ఎదుర్కొని విజయం సాధించిన విజేతలను ఆయన అభినందించారు. ఉద్యోగమే లక్ష్యంగా కాకుండా పలువురికి ఉపాధి చూపే స్థాయికి పద్మశాలీలు ఎదగాలన్నారు. యుగాలు మారాయి.. తరాలు మారాయి.. ఆధునిక నాగరిక నవతరాన్ని కుదిపేస్తున్న ప్రస్తుత తరుణంలో మనోళ్లు చరిత్ర తిరగరాస్తున్నారన్నారు. నేను నా కుటుంబం, మా ఆనందం అన్న పరిధి దాటి సమాజ హితానికి పద్మశాలీలందరూ పాటుపడుతున్నారని పార్థసారథి తెలిపారు.

## పట్టుదలే లక్ష్యానికి మార్గం..

నిరుద్యోగ యువత వివిధ రంగాలలో రాణించాలంటే సంకల్ప బలం మెండుగా ఉండాలని పార్థసారథి అన్నారు. డబ్బులు ఉంటేనే సంతోషంగా ఉంటాం అనేది నిజం కాదని, అసలైన సంతోషం ఎక్కడ ఉందో వెతుక్కోవాలని సూచించారు. నీతి, నిజాయితీ కలిగిన అధికారులను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వ సర్వీసులో చేరిన ఉద్యోగులు అవినీతి మరకలు లేకుండా ఉద్యోగ విరమణ పొందాలని, నిజాయితీగా ప్రజా శ్రేయస్సు కోసం పనిచేయాలని చిట్ల పార్థసారథి కోరారు. ముల్లు గుచ్చుకుంటుందేమోనని అడుగులు వేయడం మానేస్తే జీవితం స్తంభిస్తుందన్నారు. తపన.. కష్టపడే తత్వం.. పట్టుదల ఉంటే చాలు.. లక్ష్యం ఎంత దూరాన ఉన్నా చేరువవుతుందని హితబోధ చేశారు. అయితే విజయ సాధనకు విషయపరిజ్ఞానం మాత్రమే సరిపోదు. తన శక్తి యుక్తుల పట్ల నమ్మకం.. తన మీద తనకు నిండు ఆత్మగౌరవం కూడా ఉండాలన్నారు. ఆత్మాభిమానం మనలోని సమస్త శక్తులను ఆవిష్కరించడానికి ఒక మహా ద్వారంలో నిలబడుతుందని ఆయన పేర్కొన్నారు. యువతకు ధీమా కల్పిస్తూ ప్రభుత్వ, ప్రైవేటు రంగాలను ప్రోత్సహించాలన్నారు. అదేవిధంగా సరికొత్త ఆవిష్కరణలకు నాంది పలకాలని సూచించారు. మన విద్యార్థులు విద్యారంగంలో విశేషంగా రాణిస్తున్నారన్నారు. ప్రతి పోటీ పరీక్షలో మనవారే మెరిట్ ను సాధిస్తున్నారంటే అతిశయోక్తి కాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా విషయక విషయాల్లో ఇచ్చే ప్రతిభా పురస్కార్ అవార్డులు ప్రతి ఏటా మనవారు పొందుతున్నారంటే పద్మశాలీల ప్రతిభా పాటవాలు ఏ పాటివో అర్థం చేసుకోవచ్చన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు, రివార్డులు, నగదు పారితోషికాలు పొందుతున్న మన వారు నేడు ఇతర కులాల వారికి ఆదర్శంగా నిలిచారని పార్థసారథి వివరించారు. ఎవరం ఏ స్థాయిలో ఉన్నప్పటికీ తల్లి ఒడి లాంటి కులం వారిని మర్చిపోవద్దన్నారు. జీవితంలో స్థిరపడిన వారంతా మన కుల బాంధవుల కోసం చేతనైన సహాయం చేయాలని ఆయన సూచించారు.

## రాజ్యాధికారం దిశగా..

పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కోడం రవి ప్రకాష్ మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలుగా పద్మశాలి ఉద్యోగుల సంఘం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అపార మేధా సంపత్తికి, అర్థబలాలకు మనకు కొదవలేదన్నారు. అయితే వ్యవస్థను శాసించే రాజ్యాధికారం మాత్రం మన చేతిలో లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దేశభక్తి, సేవా భావం, నిరుపమాన త్యాగానిరతులను నరనరాన జీర్ణించుకున్న కులం మనదని, ఆత్మాభిమానం నిండుగా కలిగిన మన వారెందరో మడమతిప్పని చేతనాజ్యోతులై వెలిగారని వారు వివరించారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వల్స సుధీర్ మాట్లాడుతూ విజ్ఞానాన్ని సముపార్జించిన మనం అన్ని రంగాలలో రాణించలేకపోతున్నామనే బాధ వ్యక్తం చేశారు. పవర్ లో ఉన్న ప్రజాప్రతినిధులు, ప్రధాన రాజకీయ పార్టీల పెద్దలు మన వారికి సరైన మద్దతును అందివ్వకపోవడం వల్ల మన కుల బాంధవులు తరచూ అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని విధాల అభివృద్ధి చెందిన పద్మశాలి ప్రముఖులు మనోళ్ల అభివృద్ధికి పాటుపడాలని వారు కోరారు. అనంతరం ప్రెస్ క్లబ్ పూర్వ అధ్యక్షులు గడ్డం కేశవమూర్తి మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చనడానికి మన పద్మశాలి ముద్దుబిడ్డలే సాక్ష్యంగా నిలుస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి పార్థసారధి పరిచయ కార్యక్రమాన్ని కేశవమూర్తి నిర్వహించారు. ఆద్యంతం సభికలను నవ్విస్తూ, ఆలోచింపజేస్తూ కేశవమూర్తి ప్రసంగం సాగింది. ఆయన మాట్లాడుతున్నంతసేపు చప్పట్లు, హర్షద్వానాలతో సభా ప్రాంగణం మారుమ్రోగింది. కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తౌటమ్ ఝాన్సీ, పద్మశాలి జర్నలిస్టుల పరపతి సంఘం ప్రధాన కార్యదర్శి వల్లాల వెంకటరమణ, కోశాధికారి వేముల సదానందంతో పాటు గ్రూపు వన్, గ్రూప్ టు సాధించిన యువతి యువకులు తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంతీయ పద్మశాలి సంఘం కార్యదర్శి వైద్యం రాజగోపాల్ , హనుమకొండ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు బచ్చు ఆనందం, రిటైర్డ్ ఎమ్మార్వోలు మార్గం కుమారస్వామి, కుసుమ సత్యనారాయణ, గొట్టిముక్కుల సదానందం, వివిధ సంఘాల నాయకులు బోడ్డున వెంకటేశ్వర్లు, బింగి సురేష్, దేవులపల్లి రాఘవేందర్, వంగరి సూర్యనారాయణ, తౌటం రవీందర్, మిట్టకోళ్ల చంద్రమౌళి, పిట్ట ఉమాదేవి, కూచన రాజు, కొండ బత్తుల రాజమౌళి, చిందం లింగమూర్తి, కొండ శ్రీనివాస్, మల్లికార్జున్, మాచర్ల శివప్రసాద్, గుర్రపు రాజమౌళి, బూర తిరుపతయ్య, దేవులపల్లి సాయిరాజ్, సిరిపురం శేఖర్, నల్ల మాధవి, ఆడెపు నాగరాజు, కందగట్ల ప్రసాద్, కుడికాల సత్యనారాయణ, సాదుల విజయ్, మాచర్ల శివప్రసాద్, చెరుకు వేణు ప్రసాద్, వడిచెర్ల శ్రీనివాస్, దాసరి శ్రీనివాసులు, తౌటం భాస్కర్, బండారి ప్రమెద్, గోరంటల అశోక్ మెరుగు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## విజేతలకు సన్మానం..

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఉన్నత ఉద్యోగాలు సాధించిన పద్మశాలి ముద్దుబిడ్డలను రాష్ట్ర ఎన్నికల మాజీ ప్రధాన కమిషనర్ చిట్ల పార్థసారథి ఘనంగా సన్మానించారు. గ్రూప్ వన్ లో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించి డిప్యూటీ కలెక్టర్లుగా ఎంపికైన తౌటం రోహిత్, కుడికాల భవ్య, మంద అపూర్వతో పాటు మార్త సూర్యతేజ (డీఎస్పీ), సుద్దాల రోహిత్ రాజ్ (సీటీఓ), గడ్డం నాగవైష్ణవి (ఆడిట్ ఆఫీసర్), వలుస శ్రేయాంత్ (ఎంపీడీవో), చిలువేరు వరుణ్ కుమార్ (ఎంపీడీవో), గ్రూప్– 2 ఉద్యోగులు ఎర్రం భార్గవ్ (డిప్యూటీ తహసిల్దార్), తౌటం అరుణ్ కుమార్ (ఏఎస్ఓ), చెన్న ప్రణీత్ కుమార్ (ఏఎస్ఓ), గోక రాజశేఖర్ (ఏసీటీఓ), భోగ సతీష్ (ఏడీ హ్యాండ్లూమ్), దేవసాని వెంకటేష్ (జిల్లా ప్రొహిబిషన్ ఆఫీసర్), దీకొండ అనూష (ఏడీ హ్యాండ్లూమ్స్), దిడ్డి ప్రశాంత్ (ఏఎస్ డబ్ల్యూఓ), దిడ్డి క్రాంతిని ఘనంగా సన్మానించారు. అనంతరం తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం, పద్మశాలి జర్నలిస్టుల సంఘం వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో పార్థసారధిని ఘనంగా సన్మానించారు. శాతువాలతో సత్కరించి పూల బోకేలను అందించారు. ఈ సందర్భంగా ఉన్నత చదువుల కోసం పేద పద్మశాలి విద్యార్థులు గాదాసు కార్తీక్ కు రూ.20 వేలు, గోవిందుల పూజితకు రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం అందజేసింది. ఉత్సాహభరితంగా కొనసాగిన ఈ అభినందన సన్మానోత్సవ కార్యక్రమంలో విజేతల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.










